క్లుప్తంగా

భూసేకరణపై గ్రామసభ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశం

నారాయణఖేడ్: నాయణఖేడ్–నిజాంపేట్–బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ కోసం ఆర్డీవో వెంకటేష్ శుక్రవారం నిజాంపేట్, మునిగేపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతులకు అవార్డు విషయం గూర్చి వివరించారు. రైతులు అడిగిన వివిధ అనుమానాలను నివృత్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణ, జాతీయ రహదారుల విభాగం డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఇన్‌చార్జి ఆర్‌ఐ రాచందర్, పంచాయతీ కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, సుందర్‌రావు పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని నెలలుగా బెల్టు దుకాణంలో పట్టుబడిన మద్యం సీసాలను శుక్రవారం ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్ దుకాణాలపై దాడి చేసి సుమారు 100 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కొల్లూర్ పోలీసులు స్థానిక ఎక్సైజ్ అధికారుల సమక్షంలో మద్యం సీసాలను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు.

ఇసుక ఫిల్టర్ల కూల్చివేత



ఇసుక ఫిల్టర్‌ను కూల్చివేయిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్యాతోల్ శివారులో అక్రమంగా కృత్రిమ ఇసుక తయారుచేస్తున్న ఫిల్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ కృత్రిమ ఇసుక ఫిల్టర్లతో భూగర్భజలాలు అడుగంటుతాయన్నారు. ఇసుక ఫిల్టర్లను అడ్డుకునేందుకు పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్ కుమార్, వినయ్ కుమార్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డంప్‌యార్డు పనులు నిలిపివేయండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్లవల్లి, ప్యారానగర్ ఆటవీ ప్రాంతంలో నిర్మించనున్న డంప్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నల్లవల్లి ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మోహన్‌చంద్ర పర్గేయన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటవీప్రాంతంలో డంప్‌యార్డు నిర్మిస్తే ఆటవీ సంపదతో పాటు నీళ్లు కలుషితమవుతాయన్నారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి, సూరారం, ప్యారానగర్ గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డంప్‌యార్డు పనులు నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో సీనియర్ నాయకులు సద్ది విజయ భాస్కర్‌రెడ్డి, మహ్మద్ హుస్సేన్ ఉన్నారు.

4500 లీటర్ల డీజిల్ స్వాధీనం

జహీరాబాద్ టౌన్: కర్నాటక రాష్ట్రం నుంచి అక్రమంగా రాష్ట్రానికి తరలిస్తున్న డీజిల్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర సరిహద్దులోని చిరాగ్‌పల్లి సమీపంలో గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆటోలో తరలిస్తున్న 1500 లీటర్లు, లారీలో తరలిస్తున్న 3000లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. దీంతో డీజిల్‌తో పాటు వాహనాలను సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేతివృత్తులకు చేయూత

- పీఎం విశ్వకర్మ యోజన పథకంతో రూ.3లక్షల రుణ సదుపాయం
- 5శాతం వడ్డీతో 3విడతల్లో అందేవిధంగా రూపకల్పన
- తొలుత 18 సంప్రదాయ వృత్తుల ఎంపిక
- సీఎస్‌సీల ద్వారా దరఖాస్తుల ఆహ్వానం



కుమ్మరి వృత్తిదారులు తయారుచేసిన కుండలు



కల్లు గీస్తున్న గౌడ కార్మికుడు

మునిపల్లి(అందోల్): సాంప్రదాయ చేతివృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 2023 స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రకటించగా సెప్టెంబర్ 17వ తేదీన ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 5శాతం వడ్డీకే రూ.3లక్షల రుణ సదుపాయం పొందే అవకాశం ఉంది. ఈ పథకం 2023–24 నుంచి 2027–28 వరకు అయిదేళ్ల పాటు అమలులో ఉండనున్న ఈ పథకంతో జిల్లాలోని లక్ష కుటుంబాల వరకు లబ్ధి చేకూరనుంది. ఈ పథకంపై అధికారులు వృత్తిదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

పథకం అమలు తీరు ఇలా...

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డును అందిస్తారు. తొలివిడత ద్వారా రూ.లక్ష వరకు రుణం ఇస్తారు. ఈ రుణాన్ని పొందినవారు తిరిగి 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. మళ్లీ రెండో విడత ద్వారా రూ.2 లక్షల రుణం ఇస్తారు. ఈ రుణాన్ని కూడా 18 నెలల్లో చెల్లించాలి. క్రమం తప్పకుండా రెండు విడతల్లో తీసుకున్న రుణం చెల్లించిన వారికి మూడో విడతల్లో రూ.3 లక్షల రుణం ఇస్తారు. దీనికి కేవలం 5శాతం వడ్డీ వసూలు చేస్తారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని కళాకారులు, చేతివృత్తుల వారికే ఈ స్కీం వర్తిస్తుంది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు రోజుకు రూ.500 ఇస్తూ 5 రోజులు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. అదేవిధంగా మరో 15 రోజులు అడ్వాన్సు శిక్షణ ఇచ్చి టూల్ కిట్‌కు రూ.15 అందజేస్తారు. తొలుత 18 సంప్రదాయ వృత్తులకు ఈ స్కీం ప్రయోజనాలు అందనున్నాయి.

దరఖాస్తు చేసే విధానం ఇలా...

ఎంపిక చేసిన వృత్తులకు చెందినవారు కామన్ సరీ్వస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్‌కార్డు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేదీ లేదు. అయితే ఈ పథకంపై ప్రజల్లో పెద్దగా అవగాహన లేదు. అర్హులకు లబ్ధి చేకూరాలంటే అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

వర్తించేది వీరికే...

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో ముందుగా 18 సంప్రదాయ వృత్తులను ఎంపిక చేస్తారు. వీరిలో కుమ్మరి, స్వర్ణకారులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, శిల్పులు, రాళ్ల పగలగొట్టే వాళ్లు, తాళాలు రిపేరు చేసేవాళ్లు, మేస్త్రీలు, బుట్టలు అల్లేవాళ్లు, చీపుర్లు తయారుదార్లు, చేపల వలలు తయారు చేసే వాళ్లు, వివిధ రకాల కులవృత్తుల వారితో పాటు మోటర్ మెకానిక్‌లకు వర్తిస్తుంది.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

జోగిపేట(అందోల్): పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని అందోలు మండల శాఖ ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు నరోత్తంకుమార్ పీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. సీనియర్ పీఆర్‌టీయూ సభ్యులు మధుసూధన్, ప్రేమ్‌కుమార్, ఆశయ్య, విశ్వనాథంను ఘనంగా సన్మానించారు. సంఘం మండల కార్యదర్శి రాజమల్లు, పీఆర్‌టీయూ నాయకులు మంజ్యానాయక్, అజిత్‌ప్రసాద్, అనిల్‌కుమార్, సుభాష్, నవీన్‌కుమార్, రమేశ్, శ్రీశైలం, శ్రీనివాస్, త్రినాథ్‌రావు, మహేష్‌కుమార్, మహేందర్, మాయాచారి, మౌలానా, మహిళా ప్రతినిధులు జయలత, లావణ్య, సుధారాణి పాల్గొన్నారు.

మండల వనరుల కేంద్రంలో...

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు తుల సీరాంరాథోడ్ మాట్లాడుతూ పీఆర్టీయూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలను చేస్తోందన్నారు. అనంతరం పదవివిరమణ పొందిన చంద్రశేఖర్, మోజెస్‌ను సన్మానించారు. జహీరాబాద్ డివిజన్లోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, న్యాల్కల్ మండలాల అధ్యక్షులు, నాయకులు వరాలు, బాలయ్య, శ్రీశైలం, ప్రదీప్‌కుమార్, శివకుమార్, అర్జున్, నాగయ్య స్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



పీఆర్‌టీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు నరోత్తం.

పుచ్చకాయ సాగుపై అవగాహన

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని రంజోల్ రైతువేదికలో రైతులకు పుచ్చకాయ, మొక్కజొన్న సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, ఉద్యావన శాస్త్రవేత్త సరిత పంటల సాగు గురించి వివరించారు. పుచ్చకాయలో అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన విధానాలు, రకాల ఎంపిక, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం గ్రామ పరిధిలోని పంట పొలాలను సందర్శించి పుచ్చకాయ సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. డ్రిప్, మల్చింగ్ పద్ధతులు, కలుపు నివారణ, నీటి ఆదా, కూలీల ఖర్చుల తగ్గింపు, చీడ పీడల నివారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు శైలజ, ఏఓ ప్రదీప్ కుమార్ ,శ్రీకాంత్, రాజశేఖర్ రైతులు శ్రీనివాస్‌రెడ్డి మోహన్ కృష్ణమోహన్ కొండా లక్ష్మణ్ బాపూజీ విద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పుచ్చకాయ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

నారాయణఖేడ్: ఈ నెల 15వ తేదీన గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌పీహెచ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంజారా హిల్స్‌లో వచ్చే జయంతి నాటికి సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపన చేస్తామన్నారు. గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. త్వరలో తండా, గూడెం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, సేవాలాల్ రూపాన్ని నాణెంపై ముద్రించేందుకు సిఫారసు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారని వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పటాన్‌చెరుటౌన్: కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి గ్రామానికి చెందిన చంద్రయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పని పూర్తి చేసుకొని పడుకున్నాడు. ఈ క్రమంలో పక్క పొలానికి చెందిన వివేక్‌రెడ్డి నిర్లక్ష్యం కారును నడిపి అక్కడే నిద్రిస్తున్న చంద్రయ్యపై నుంచి తీసుకెళ్లాడు. దీంతో తీవ్ర గాయాలైన చంద్రయ్యను చికిత్స కోసం పటాన్‌చెరులోని ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురికి జరిమానా

సంగారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ సుమన్‌మార్ తెలిపిన వివరాల ప్రకారం... బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురిని అదుపులోకి తీసుకొని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ముగ్గురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించగా మరో వ్యక్తికి జరిమానాతో పాటు 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం

నారాయణఖేడ్: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై నారాయణఖేడ్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ ఇన్‌చార్జి సుగుణాకర్, నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, సాయిందర్, రాజుగౌడ్, పట్నం మాణిక్, సతీష్, లోకేష్, రాజు, సంజీవ్‌యాదవ్ పాల్గొన్నారు.

హత్నూర (సంగారెడ్డి): దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పీవీ నరసింహారావు దేశంలో ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశ ఆర్థికవ్యవస్థను పటిష్టం చేశారన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

జహీరాబాద్ టౌన్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్‌యాదవ్, వేణుగోపాల్, సతీష్‌కుమార్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, చందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బిల్లులను చెల్లించాలి

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో వినియోగించుకున్న వాహనాల అద్దె బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాహనదారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాహనాదారులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం వాహనాలను అద్దెకు మాట్లాడారని, ఎన్నికలు ముగిసిన మరుసటి రోజునే అద్దెలు చెల్లిస్తామని హామీనిచ్చి ఇప్పటివరకూ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే త్వరలోనే డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వట్‌పల్లి(అందోల్): యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతం అవుతున్న నేపథ్యంలో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జోగిపేట ఏడీఏ అరుణ అన్నారు. అందోలు మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో వరి పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినాట్లు వేసిన 15 నుంచి 20 రోజులలోపు హైడ్రోక్లోరైడ్ 4జీ గులికలను ఎకరాకు 8 కిలోల చొప్పున లేదా నీలి ప్రోల్ 18.5ఎస్‌సీ (కోరాజిన్)60ఎంఎల్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా కాండం తొలుచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. వరి నాటిన 30 రోజుల లోపే మొగి పురుగును పూర్తిస్థాయిలో నిర్మూలించుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఏఈఓ అనిత, రైతులు దశరథ్, సాలయ్య, మాణయ్య పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గృహజ్యోతి పథకం వివరాలు సేకరించాలి



నిరసన తెలుపుతున్న బాగారెడ్డిపల్లి గ్రామస్తులు

జహీరాబాద్ టౌన్: గృహజ్యోతికి పథకానికి సంబంధించిన వివరాల సేకరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని బాగారెడ్డిపల్లి కాలనీవాసులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. 200యూనిట్ ఉచిత కరెంట్ కోసం ట్రాన్స్‌కో అధికారులు వివరాల సేకరణ చేపట్టారు. అయితే తామంతా ఉదయాన్నే కూలిపనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తామన్నారు. వివరాలను అందజేయడానికి దూరంలో ఉన్న ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. సమయం తక్కువగా ఉన్నందునా బాగారెడ్డిపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద దరఖాస్తులను స్వీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

మతిస్థిమితం లేని మహిళ హల్‌చల్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో మతిస్థిమితం లేని మహిళ గురువారం రాత్రి హల్‌చల్ చేసింది. గ్రామంలోని చిన్నారులతో మాట్లాడుతూ వారిని ఎత్తుకుంటుండటంతో పాటు చిన్నారులను ఎత్తుకొని పరుగెడుతుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఆ మహిళ రాళ్లతో గ్రామస్తులను కొడుతుండటంతో గ్రామస్తులు ఆమెను చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకుని మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ నయీముద్దీన్ మాట్లాడుతూ సదరు మహిళ పేరు గంగా అని గచ్చిబౌలిలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటుందని తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేదని, ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి పంపుతామని వారి కుటుంబ సభ్యులు తెలిపినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

మనూరు(నారాయణఖేడ్): మాఘ అమవాస్య సందర్భంగా బోరంచలోని మంజీర నదితీరం వద్ద వెలిసిన సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

◆ కరపత్రాలు పంపిణీ

నారాయణఖేడ్: గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం ఆధ్వర్యంలో ఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్‌లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

సంగారెడ్డి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నేత కొండాపురం జగన్ అన్నారు. గావ్ చలో ఘర్ చలో కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణ పరిధిలోని రాజంపేట గ్రామంలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణ బీజేపీ అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యక్షుడు నాగారం సంతోష్, 107 బూత్ అధ్యక్షురాలు సుజాత, 108 బూత్ అధ్యక్షుడు శరత్‌బాబు, నాయకులు సాయి, వీరేష్, అభి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి జాతీయ స్థాయి పోటీలు

పటాన్‌చెరు: నాలుగో సెస్టోబాల్ ఫెడరేషన్ కప్ పోటీలను అమీన్‌పూర్‌లోని సూర్య ది గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీధరిత్రి, ఇండియా సెస్టోబల్ సెక్రెటరీ జనరల్ మహమ్మద్ అఖిబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే సెస్టోబాల్ ఫెడరేషన్ కప్–2024 పోటీలకు 14 రాష్ట్రాల నుంచి పది పురుషుల జట్లు, ఎనిమిది మహిళల జట్లు పోటీ పడనున్నట్లు తెలిపారు.

◆ 17నుంచి ఉర్సు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని కాసాల శివారులో ఉన్న దౌల్తాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వరకు హజ్రత్ సయ్యద్ ఆబేద్ హుస్సేన్ చిస్తి ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17, సందల్ ముబారక్ (గంధం), 18 చిరగా (దీపారాధన) సమ కార్యక్రమం, 19న కత్మ ఖురాన్ జియరత్ ఫాతిహా నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ 11న వివాహ పరిచయ కార్యక్రమం

నారాయణఖేడ్: వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 11న మధ్యాహ్నం 1.30 గంటలకు 8వ వార్షిక రాష్ట్రస్థాయి పద్మశాలీ వధూవరుల వివాహ పరియ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, శ్రీనివాస్, కోశాధికారి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని పద్మశాలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9704360703 నెంబరులో సంప్రదించాలన్నారు.

◆ సమ్మె కరపత్రాల ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నరసనగా ఉద్యమిస్తామని సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అన్నారు. సంగారెడ్డి మండలంలోని కల్పగూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను కరపత్రాలను శుక్రవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

◆ పెండింగ్ డీఏలు చెల్లించండి

నారాయణఖేడ్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్‌జాదవ్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో కంగ్టి మండల కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలు పడ్డ 3 డీఏలకు సంబంధించిన జీవోను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఖేడ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిసింగ్, రాజు, నాయకులు అంజయ్య, స్వామి, జైపాల్, రవీందర్, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని దౌల్తాబాద్ శివారులోని మంజీరానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలువురు నదిలో మృతదేహం తేలియాడటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 40 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. మృతుడి ఒంటిపై బ్లాక్ కలర్ షర్ట్, కుడిచేతిపై పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ శ్రమదానం

మునిపల్లి(అందోల్): ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తాటిపల్లి, పిల్లోడి, కల్లపల్లి బేల్లూర్, పెద్దలోడి, కంకోల్, బుదేరా తదితర గ్రామాల్లో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు, ఎంపీఓ అంజలిదేవి, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

◆ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కార్పొరేటర్ పుష్ప ఖైరతాబాద్‌లోని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రూ.4.05 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

◆ క్వారీల భూముల సర్వే

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎర్దనూర్, బ్యాతోల్ శివారుల్లో పలు క్వారీలకు కేటాయించిన భూముల సర్వే ప్రారంభమైంది. కలెక్టర్ క్రాంతి 0ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 231లో శ్రీసాయి మెటల్స్, శ్రీసంతోషి మెటల్స్‌కు కేటాయించిన భూములను రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించారు. మిగతా 10 క్వారీల భూములను కూడా సర్వే చేస్తామని తహసీల్దార్ తెలిపారు. సర్వేలో ఆర్ఐ వెంకట్‌రెడ్డి, సర్వేయర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

◆ పాస్వర్డ్ చెప్పలేదని వ్యక్తిపై దాడి

పటాన్‌చెరు టౌన్: సెల్‌ఫోన్ విక్రయించిన వ్యక్తి దాని పాస్వర్డ్ చెప్పలేదని కొనుగోలు చేసిన వ్యక్తి, అతని కుటుంబ సభ్యులు దాడికి దిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన అశోక్ మూడు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవపడి పటాన్‌చెరులో ఉన్న తన స్నేహితుడు శ్రీను ఉంటున్న గదిలో ఉంటున్నాడు. అయితే అశోక్‌కు నగదు అవసరం కావడంతో తన సెల్‌ఫోన్‌ను రూ.1700కు శ్రీను సోదరుడు సుభాష్‌కు విక్రయించాడు. అయితే దాని పాస్వర్డ్ మాత్రం చెప్పలేదు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన శ్రీను ఇంటి వద్ద పడుకున్న అశోక్‌పై పాస్వర్డ్ చెప్పకుండా మోసం చేస్తావా అంటూ సుభాష్, అతని సోదరుడు శ్రీను కలిసి దాడి చేశారు. దీంతో బాధితుడు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.